సాక్షి
తిరుపతి
గురువారం । 16 । మార్చి । 2023




తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.59,110
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,280
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.68,200
రిటైల్ వెండి గ్రాము	రూ.70.20

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	23
చిత్తూరు	34	23
తిరుమల	30	19
గూడూరు	34	26
నగరి	36	24

సిరులతల్లికి క్షీరాధివాసం



తిరుపతి అలిపిరి : చెన్నైలో టీటీడీ నూతనంగా నిర్మించిన శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో బుధవారం క్షీరాధివాసం నిర్వహించారు. ఆగమ సలహాదారుడు శ్రీనివాసాచార్యులు, చెన్నై స్థానిక సలహా మండలి అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, డిప్యూటీ ఈఓ విజయకుమార్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పదకవితా పితామహుడు అన్నమయ్య

- 520వ వర్ధంతి కార్యక్రమాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

తిరుపతి అలిపిరి : శ్రీతాళ్లపాక అన్నమాచార్యుల వారు పదకవితా పితామహునిగా శ్రీవారికి విశేషసేవలందించారని టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి కొనియాడారు. ఆ మహనీయుని 520వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. బుధవారం ఈ మేరకు తిరుపతిలోని పరిపాలన భవనంలో కార్యక్రమాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో తిరుపతి, తిరుమల, తాళ్లపాకలో వర్ధంతి కార్యక్రమాలు జరిపించనున్నట్లు వివరించారు. పోస్టర్ ఆవిష్కరణలో టీటీడీ జేఈఓ సదా భార్గవి, ఎఫ్ఏసీఏఓ బాలాజీ, ధార్మిక ప్రాజెక్టుల ప్రోగ్రామ్ అధికారి రాజగోపాలరావు, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు విభీషణశర్మ పాల్గొన్నారు.

రీ పోలింగ్ పరిశీలన



రీ పోలింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బుధవారం తిరుపతిలోని రెండు కేంద్రాల్లో రీ పోలింగ్ నిర్వహించారు. 229, 233 బూత్‌లలో ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ సజావుగా సాగింది. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ నుంచి కలెక్టర్ ఎప్పటికప్పుడు పోలింగ్ సరళిని పర్యవేక్షణ చేశారు.

నేడు చెంగాళమ్మ సేవకు 'సింగీతం'

సూళ్లూరుపేట : పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి ఆలయానికి గురువారం ఉదయం 7.30 గంటలకు సినీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు రానున్నట్లు ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అమ్మవారిని ఏటా రెండు మూడు పర్యాయాలు సింగీతం దర్శించుకునేందుకు వస్తుంటారని వెల్లడించారు.



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరినారాయణన్



సమావేశానికి హాజరైన కౌంటింగ్ సిబ్బంది

నేడే మండలి కౌంటింగ్

- ఆర్‌వీఎస్ కళాశాలల్లోని రెండు కేంద్రాల్లో కౌంటింగ్
- ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ
- పట్టభద్రులకు 70.66 శాతం, టీచర్లకు 89.34 శాతం పోలింగ్
- సీసీ కెమెరాల నిఘా నీడన మూడు షిఫ్టుల్లో ఓట్ల లెక్కింపు
- భారీ బందోబస్తు.. పటిష్ట ఏర్పాట్లు



కౌంటింగ్‌కు ఏర్పాటు చేసిన టేబుళ్లు

సాక్షి, చిత్తూరు/కలెక్టరేట్ : తూర్పు రాయలసీమ పరిధిలోని ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో నిర్వహించిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు గురువారం జరుగనుంది. చిత్తూరు సమీపంలోని ఆర్‌వీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఇందుకోసం జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరి నారాయణన్, జేసీ వెంకటేశ్వర్, డీఆర్‌ఓ రాజశేఖర్ కౌంటింగ్ ప్రక్రియపై అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. పట్టభద్రుల స్థానానికి 22 మంది అభ్యర్థులు, టీచర్ల స్థానానికి 8 మంది పోటీలో నిలవగా, భారీగా పోలింగ్ నమోదైంది. ఈక్రమంలో ఓట్ల లెక్కింపుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. సాధారణ ఎన్నికలతో పోలిస్తే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసే విధానంతోపాటు లెక్కింపు విభిన్నంగా ఉంటుంది. సాధారణ ఎన్నికల్లో ప్రత్యర్థి కంటే ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా విజేతగా ప్రకటిస్తారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాధాన్యత ఓట్ల విధానంలో ఫలితాలు ఎప్పుడు, ఎటు మారతాయో చెప్పడం కష్టం. పోలైన ఓట్లలో 50 శాతం కంటే ఒక ఓటు అధికంగా వచ్చే వరకు లెక్కింపు కొనసాగిస్తారు. వరుసగా ప్రాధాన్యతా ఓట్లను పరిగణనలోకి తీసుకుని ఆ తర్వాతనే విజేతను ప్రకటిస్తారు. ఈసారి పట్టభద్రుల ఎన్నికలకు 3,79,810 మందికి గాను 2,68,387 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 27,694 మందికి గాను 24,741 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. రెండు స్థానాలకు అభ్యర్థులు ఎక్కువగా ఉండడంతో లెక్కింపునకు ఎంత సమయం పడుతుందో కూడా చెప్పలేని పరిస్థితి.

ఉదయం 8 గంటలకు ప్రారంభం

ఉదయం 8 గంటలకు సీసీ కెమెరాల నిఘాలో బ్యాలెట్ బాక్సులు ఓపెన్ చేయనున్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ పేపర్లు ఓపెన్ చేసి, పోలైన ఓట్లను 25 చొప్పున బండిల్స్ కడతారు. సాయంత్రం మొదటి ప్రాధాన్యత ఓట్లు లెక్కిస్తారని, ఈ ప్రక్రియ పూర్తి కావడానికి 24 గంటల నుంచి 36 గంటలు పట్టే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. మొదటి ప్రాధాన్యత ఓట్లతో అభ్యర్థి ఎవ్వరూ గెలవకపోతే, ఎలిమినేషన్ పద్ధతిలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగిస్తారు. సీసీ కెమెరాలు, వెబ్ క్యాస్టింగ్ పర్యవేక్షణలో లెక్కింపు ప్రక్రియ జరుగనుంది.

మూడు షిఫ్టుల్లో కౌంటింగ్

ఎస్వీసెట్ లా కళాశాలలో టీచర్ ఎన్నికల ఓట్ల కౌంటింగ్, ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో పట్టభద్రుల ఎన్నికల ఓట్ల కౌంటింగ్ జరుగనుంది. పట్టభద్రుల ఓట్ల కౌంటింగ్ కు ఒకే హాల్‌లో 40, ఉపాధ్యాయ ఎన్నికల కౌంటింగ్‌కు ఒకే హాల్‌లో 14 టేబుల్స్ ను ఏర్పాటు చేశారు. మూడు షిఫ్టుల్లో సిబ్బంది పనిచేసేలా చర్యలు తీసుకున్నారు. అదనపు సిబ్బందిని సైతం నియమించారు. గురువారం సాయంత్రం వరకు బండిల్స్ కట్టే ప్రక్రియ కొనసాగే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో 193 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 551 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 172 మంది మైక్రో అబ్జర్వర్‌లు మొత్తం 916 మంది పాల్గొననున్నారు.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు



కౌంటింగ్ కట్టుదిట్టంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేశాం. పకడ్బందీగా ఏర్పాట్లు చేశాం. పారదర్శకంగా, వేగంగా నిర్వహిస్తాం. కౌంటింగ్ సిబ్బందికి ఎన్నికల నిబంధనల ప్రకారం శిక్షణ ఇచ్చాం.

– హరి నారాయణన్, రిటర్నింగ్ అధికారి, కలెక్టర్

నిఘా నీడలో కౌంటింగ్



కౌంటింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటు చేశాం. సీసీ కెమెరాల పర్యవేక్షణలో కౌంటింగ్ కొనసాగుతుంది. మొబైల్ ఫోన్లకు అనుమతి లేదు. పట్టభద్రుల ఎన్నికల ఓట్ల లెక్కింపునకు 40 టేబుళ్లు, ఉపాధ్యాయ ఓట్ల కౌంటింగ్‌కు 14 ఏర్పాటు చేశాం.

– వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్, చిత్తూరు

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

- తొలిరోజు 1,585 మంది గైర్హాజరు
- ఇద్దరు విద్యార్థుల డిబార్



పద్మావతి జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు



తిరుపతి బాలాజీ కాలనీలో ఓ కళాశాల వద్ద వేచి ఉన్న విద్యార్థినులు

తిరుపతి ఎడ్యుకేషన్: ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా మొదలయ్యాయి. మొత్తం 141 కేంద్రాల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫస్టియర్ విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్ పేపర్–1 పరీక్ష నిర్వహించారు. మొత్తం 50,390మంది విద్యార్థులకు గాను 48,805 మంది హాజరయ్యారు. 1,585మంది గైర్హాజరయ్యారు. తిరుపతిలోని ఓ పరీక్షా కేంద్రంలో ఇద్దరు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడడంతో అధికారులు డిబార్ చేశారు. గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష నిర్వహించనున్నారు.

అంబరాన్నంటిన జాతర సంబరం



జాతరలో భక్తజనం (ఇన్‌సెట్) విశేషాలంకరణలో సుగుటూరు గంగమ్మ

- స్త్రీ వేషధారణలు, గెరిగలతో మొక్కులు తీర్చుకున్న భక్తులు
- భక్తజన సంద్రమైన పుంగనూరు

పుంగనూరు: జమీందారుల కులదైవమైన శ్రీసుగుటూరు గంగమ్మ జాతర బుధవారం అంబరాన్నింటింది. మన రాష్ట్రం నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు నుంచి అశేషంగా భక్తులు తరలిరావడంతో పట్టణం భక్తజనసంద్రమైంది. అమ్మవారిని గజమాలలు, వెండి కవచం, నిమ్మకాయల మాలలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఉదయం జమీందారి కుటుంబసభ్యులు తొలిపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. వేలాది మంది భక్తులు స్త్రీల వేషధారణలో గెరిగెలతో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. తోపులాటలు చోటు చేసుకోకుండా బారికేడ్లు నిర్మించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఆలయం ప్రాంగణంలో చలువ పందిళ్లు, షామి యానాలు వేశారు. వైద్యశిబిరాలు, చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు నిర్వహించారు. కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐ మధుసూధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టారు.

నిమజ్జనం...

రెండు రోజుల పాటు జరిగిన శ్రీసుగుటూరు గంగమ్మ జాతర బుధవారం రాత్రి వైభవంగా ముగిసింది. అమ్మవారికి జమీందారులు మలిపూజలు నిర్వహించారు. రాత్రి పట్టణ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించి, గురువారం వేకువజామున నిమజ్జనం చేసి, అమ్మవారి విగ్రహాన్ని జమీందారులకు అప్పగించారు. ఈ సందర్భంగా అమ్మవారికి వేలాది మంది పూజలు చేశారు.

ఒకప్పుడు సకాలంలో వర్షాలు కురిసేవి కాదు.. వేలాది అడుగుల వరకు బోరు వేసినా నీరు పడేది కాదు.. సాగునీటి కటకట తప్పేది కాదు.. దీంతో అప్పటి ప్రభుత్వం ఆయా ప్రాంతాలను డార్క్ ఏరియాలు (క్షామపీడిత ప్రాంతాలు)గా ప్రకటించింది. కొత్తగా వ్యవసాయబోర్లు వేయడంపై నిషేధం విధించింది.. కనీసం విద్యుత్ కనెక్షన్ కూడా ఇవ్వకూడదని ఆదేశాలు జారీ చేసింది. తదనంతర కాలంలో భూగర్భజలమట్టం ఆశాజనకంగా పెరిగినా ఉత్తర్వులను సవరించడంలో గత టీడీపీ సర్కార్ నిర్లక్ష్యం వహించింది. అన్నదాత ఆక్రోశాన్ని పెడచెవిన పెట్టింది. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే రైతుల ఇక్కట్లను గుర్తించింది. క్షామ పీడిత గ్రామాల్లో పకడ్బందీగా సర్వే చేయించింది. ఆ మేరకు గత ఏడాది కొన్ని ప్రాంతాలను డార్క్ ఏరియా జాబితా నుంచి తొలగించింది. ప్రస్తుతం మరో 191 ఊళ్లపై ఆంక్షలు తొలగించి వ్యవసాయబోర్లు వేసుకునేందుకు అనుమతులు మంజూరు చేసింది. ప్రభుత్వ నిర్ణయంపై అన్నదాతల్లో హర్షాతిరేకం వ్యక్తమవుతోంది.



నాడు క్షామం.. నేడు క్షేమం

- రైతులకు తీరిన 'డార్క్ ఏరియా' శాపం
- 191 గ్రామాలపై తొలగిన నిషేధం
- కొత్తగా వ్యవసాయ బోర్లు, విద్యుత్ సర్వీసులకు అనుమతి
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతాంగం



డార్క్ ఏరియాలో ఆయిల్ ఇంజన్ వేస్తున్న రైతు (ఫైల్)

పలమనేరు : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని రైతులకు డార్క్ ఏరియాల శాపం తీరింది. ఏళ్ల తరబడి కొత్త వ్యవసాయ బోర్లు వేసుకొనేందుకు, విద్యుత్ కనెక్షన్ పొందేందుకు వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించింది. జిల్లాలో ఓవర్ ఎక్స్‌ప్లోటెడ్ గ్రామాల జాబితానుంచి 191 గ్రామాలను తొలగించింది. కొత్త ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలోని కేవలం ఆరు గ్రామాలు మాత్రమే డార్క్ ఏరియాలుగా ఉంటాయి. ఆ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆదేశాలు జిల్లా అధికారులతోపాటు సంబంధిత ట్రాన్స్ ఏడీలకు ఈ నెల 14వ తేదీన అందాయి. దీంతో డార్క్ ఏరియా జాబితానుంచి తొలగింపబడిన ప్రాంతాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తొలగిన సమస్య

ఏపీ వాల్టా చట్టం–2002 (ఏపీ వాటర్, ల్యాండ్ అండ్ ట్రీస్ యాక్టు–2002) మేరకు అప్పటి ప్రభుత్వం భూగర్భజలాల ఆధారంగా ఓవర్‌ఎక్స్‌ప్లోటెడ్ విలేజిస్‌లో భారీగా భూగర్భజలాలు అడుగంటాయని గుర్తించింది. జిల్లాలోని వందలాది గ్రామాల్లో కొత్తగా బోర్లు వేయకుండా నిషేధం విధించింది. ఆపై వర్షాలు పడి భూగర్భజలాలు పెరిగినా ఆయా గ్రామాలను నిషేధిత జాబితానుంచి తొలగించకుండా నిర్లక్ష్యం చేసింది. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది. వర్షాలు కురిసినా రైతులు బోర్లు వేసుకోలేక పంటలు సాగు చేసుకోలేని దుస్థితి ఏర్పడింది. దీనిపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దృష్టి సారించింది. పెరిగిన భూగర్భ జలాల ఆధారంగా 2022 ఆగస్టులో గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్‌తో కొత్త జాబితా తయారు చేయించింది. దీని ప్రకారం డార్క్ ఏరియా పరిధిలోని పలు గ్రామాల్లో నిషేధం తొలగించింది. ప్రస్తుతం విడుదల చేసిన జీఓ ఎంఎస్ నంబర్ 7 ద్వారా కేవలం ఆరు గ్రామాలు మాత్రమే డార్క్ ఏరియాలుగా మిగిలాయి. గుడుపల్లె మండలం జరుగుకొండ, సంగనపల్లె, సొడిగానిపల్లె, కుప్పం మండలంలోని ఎల్లజ్జనూరు, కుప్పం, కమతమూరులు మాత్రమే క్షామ పీడిత ప్రాంతాలుగా పరిగణించబడతాయి.

అన్నదాతకు అండగా ఉంటాం



డార్క్ ఏరియా గ్రామాల్లోని రైతులు ఇప్పటి వరకు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. గత టీడీపీ ప్రభుత్వం వారిని పట్టించుకోలేదు. ఈ సమస్యను పలువురు రైతులు, ప్రజా ప్రతినిధులు మా దృష్టికి తీసుకువచ్చారు. అన్నదాతకు అండగా నిలబడాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించాం. ఆయన ఆదేశాల మేరకు 191 గ్రామాలపై నిషేధం తొలగింది. ఇకపై వారు యథేచ్ఛగా బోర్లు వేసుకోవచ్చు. విద్యుత్ సర్వీసు తీసుకోవచ్చు.

– మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రైతులకు తీపి కబురు



ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని 191 గ్రామాలను డార్క్ ఏరియా జాబితా నుంచి తొలగించారు. ఆయా ప్రాంతాల రైతులకు ఇది నిజంగా తీపి కబురే. ఇకపై వారు ఎలాంటి అభ్యంతరాలు లేకుండా వ్యవసాయ బోర్లు వేసుకోవచ్చు. విద్యుత్ కనెక్షన్లకు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వెంటనే నూతన సర్వీసులు మంజూరు చేస్తాం.

– కృష్ణారెడ్డి, ట్రాన్స్‌కో ఎస్ఈ (ఆపరేషన్స్), తిరుపతి

నిషేధం తొలగిన ప్రాంతాలు

మండలం	గ్రామాల సంఖ్య
బంగారుపాళెం	01
చంద్రగిరి	02
చౌడేపల్లె	02
జీడీనెల్లూరు	05
గుడుపల్లె	22
ఐరాల	03
కలికిరి	01
కార్వేటినగరం	07
కుప్పం	20
పాకాల	02
పాలసముద్రం	03
పెద్దపంజాణి	05
పెనుమూరు	03
పులిచెర్ల	07
పూతలపట్టు	09
రామకుప్పం	15
రామచంద్రాపురం	10
రామసముద్రం	09
రేణిగుంట	02
శాంతిపురం	07
సదుం	01
ఎస్ఆర్‌పురం	14
తవణంపల్లె	05
తిరుపతి	09
వడమాలపేట	06
వెదురుకుప్పం	03
వి.కోట	04
పలమనేరు	04
బైరెడ్డిపల్లె	07
గంగవరం	03

మళ్లీ 'దొంగ' కుట్ర

- టీడీపీ నేతల వైఖరితో ఓటర్ల గందరగోళం
- రెండు కేంద్రాల్లోనూ తగ్గిన పోలింగ్ శాతం

సాక్షి, తిరుపతి : ఓటమి భయంతో టీడీపీ నేతలు మళ్లీ దొంగ ఓట్ల నాటకానికి తెరతీశారు. పోలింగ్ శాతాన్ని తగ్గించడమే లక్ష్యంగా గందరగోళం సృష్టించారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైఎస్సార్‌సీపీ నేతలపై నిందలు వేస్తూ ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. టీడీపీ నేతల ఓవర్‌యాక్షన్ కారణంగా ఓటేసేందుకు సైతం పలువురు విముఖత చూపిస్తున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఈక్రమంలోనే 13వ తేదీన నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో ప్రతి ఓటరునీ దొంగ ఓటరు అంటూ నానా యాగీ చేశారు. టీడీపీ నేతల దౌర్జన్యాలతో తిరుపతిలోని రెండు కేంద్రాల్లో రీ పోలింగ్ జరిపించాల్సిన పరిస్థితి ఎదురైంది. మళ్లీ బుధవారం 229, 233 బూత్‌లలో నిర్వహించిన రీ పోలింగ్‌లోనూ టీడీపీ శ్రేణులు రచ్చకు దిగారు. సందట్లో సడేమియా అంటూ ఆ పార్టీ కార్యకర్తలే దొంగ ఓట్లు వేసేందుకు పూనుకున్నారు. టీడీపీ నేత జేబీ అనుచరుడు దొంగ ఓటు వేసేందుకు 233 పోలింగ్ కేంద్రంలోకి చొరబడ్డాడు. గమనించిన పోలీసులు అతన్ని అడ్డుకున్నారు. టీడీపీ శ్రేణులు గొడవ చేసేందుకు యత్నించగా పోలీసులు ఎక్కడిక్కడ కట్టడి చేయటంతో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.

పోలింగ్ కేంద్రం సంఖ్య	మొత్తం ఓట్లు	13న పోలైనవి	15న పోలైనవి
229	579	318	287
233	792	463	349

సంక్షేమం.. గెలుపు తథ్యం



ఎంపీ గురుమూర్తి, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డితో కలిసి పోలింగ్ కేంద్రం వద్దకు వస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి

తిరుపతి మంగళం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని వైఎస్సార్‌సీపీ బలపరచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం తిరుపతి జీవకోన సత్యనారాయణపురంలో రీ పోలింగ్ జరుగుతున్న బూత్‌ను ఆయన సందర్శించారు. పేర్నాటి మాట్లాడుతూ జగనన్న వెంటనే జనం ఉన్నారన్నారు. ప్రపంచంలో ఏ నాయకుడూ అందించలేనన్ని పథకాలను అందిస్తున్నారని కొనియాడారు. లక్షలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పించారని, అందుకే యువత తమకు మద్దతుగా నిలిచారని వెల్లడించారు. తమపై ఆరోపణలు చేస్తున్న వారికి 17వ తేదీ సాయంత్రం సమాధానం చెబుతానన్నారు. తిరుపతిలోని రెండు పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్నారని తెలిపారు.

క్లుప్తంగా

ఎర్రచందనం పట్టివేత



ఎర్రచ్రందనం దుంగలను చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

తిరుపతి అలిపిరి : అన్నమయ్య జిల్లా రాజంపేట వద్ద 11ఎర్రచందనం దుంగలను టాస్క్ ఫోర్సు అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ మురళీధర్ అధ్వర్యంలో ఆర్ఐ కృపానంద టీమ్ రోళ్ల మడుగు అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. పెద్దకోన తలగడ వద్ద కొంత మంది దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారు. పోలీసులను గమనించి దుంగలను పడేసి పారిపోయారు. పరారైన వారి కోసం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది గాలింపు చేపట్టారు. దుంగలను తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించారు. సీఐ బాలకృష్ణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోను ఢీకొన్న లారీ

- ఐదుగురు మహిళలకు గాయాలు



చికిత్స పొందుతున్న వసంతమ్మ

నాయుడుపేటటౌన్ : మండలంలోని అన్నమేడు కూడలి వద్ద జాతీయరహదారిపై బుధవారం ఆటోను లారీ ఢీకొనడంతో ఐదుగురు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు కథనం మేరకు.. తొట్టంబేడు మండలం చెంచులక్ష్మీకాలనీకు చెందిన వసంతమ్మ, చెంగమ్మ, స్నేహలతతో పాటు మరో ఇద్దరు మహిళలు కనుపూరులో జరుగుతున్న ముత్యాలమ్మ జాతరకు ఆటోలో వెళుతుండగా ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వసంత, చెంగమ్మను మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమల ఘాట్లో చిరుత కలకలం

తిరుమల : తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో చిరుత సంచరిస్తూ భక్తుల్లో కలకం సృష్టించింది. వివరాల్లోకి వెళితే.. బుధవారం రాత్రి 8గంటల ప్రాంతంలో మొదటి ఘాట్ రోడ్డులోని 31వ మలుపు వద్ద ఓ భక్తబృందం వాహనం సమీపంలో చిరుత సంచరించడంతో భక్తులు భయాందోళనలకు గురయ్యారు. టీటీడీ భద్రతా సిబ్బందికి సమాచారాన్ని తెలిపారు. ఇదే ప్రాంతంలో బుధవారం ఉదయం కూడా కొందరు భక్తులు చిరుత సంచారాన్ని చూసినట్లు టీటీడీ అటవీశాఖ అధికారులు తెలిపారు. భక్తులు భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని తగిన జాగ్రత్త చర్యలు చేపట్టామని వివరించారు.

కుట్రలకు కేరాఫ్ చంద్రబాబు

- ఆయన కంటే ఓ అంతస్తు ఎక్కువ కట్టానని వేధించారు
- నారావారిపల్లె వాసి మధుసూదన్‌నాయుడి ఆవేదన





మాట్లాడుతున్న మధుసూదన్‌నాయుడు, తారక్ చౌదరి

సాక్షి, తిరుపతి : కుట్రలు, కుతంత్రాలకు కేరాఫ్ చంద్రబాబు నాయుడు అని సింగిల్‌విండ్ మాజీ డైరెక్టర్ మధుసూదన్‌నాయుడు స్పష్టం చేశారు. బుధవారం తిరుపతిలో రీ పోలింగ్ జరుగుతున్న 229 కేంద్రం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. నారావారిపల్లెలో చంద్రబాబు పక్క ఇంట్లోనే ఉంటున్నామన్నారు. రాజకీయాల్లోకి రాకముందుకు వారికి కేవలం 2.5 ఎకరాలుంటే, తమకు 25 ఎకరాలు ఉండేవన్నారు. ఆ సమయంలో బాబు ఇంటి కంటే ఓ అంతస్తు అదనంగా కట్టానని, అప్పటి నుంచి తనపై కక్ష పెంచుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చాక తిరుమలలో తనకు ఉన్న హోటళ్ల అనుమతులు రద్దు చేయించారని ఆరోపించారు. 1972 నుంచి చంద్రబాబు చేసిన కుట్రలు, కుతంత్రాలు, వెన్నుపోట్లపై 28 పేజీల పుస్తకం కూడా రాశానని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు స్వచ్ఛందంగా వచ్చి ఓట్లు వేశారన్నారు. దొంగ ఓట్లు వేయించే సంస్కృతి చంద్రబాబుదే అని వెల్లడించారు. కుప్పంలో ఎప్పుడు ఎన్నికల్లో జరిగినా తమిళనాడు నుంచి మనుషులను తీసుకొచ్చి దొంగ ఓట్లు వేయించేవారని వివరించారు. చంద్రబాబు కుట్రలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భయపడరని, 2024లో తిరిగి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థులే విజయం సాధిస్తారని వెల్లడించారు.

మా కుటుంబం వల్లే బాబు గెలిచారు

'మా కుటుంబం దయా దాక్షిణ్యాల వల్లే అప్పట్లో చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యేగా గెలుపొందారు' అని ఆయన సమీప బంధువు తారక్ చౌదరి వెల్లడించారు. ఎమ్మెల్సీ ఎన్నికల రీపోలింగ్‌లో ఓటేసేందుకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు తొలిసారి పోటీచేసిన సమయంలో తమ కుటుంబీకులకు మాయమాటలు చెప్పి ఆ ఎన్నికల్లో గెలుపొందారని తెలిపారు. మనుషుల్ని వాడుకోవడంలో ఆయనకు మించిన వాడు లేరన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కమ్మ సామాజిక వర్గానికి వ్యతిరేకం కాదని వివరించారు.

ఏసీబీకి చిక్కిన గ్రామ కార్యదర్శి

- రూ.40 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



ఏసీబీ దాడిలో పట్టుబడ్డ పంచాయతీ కార్యదర్శి రమణయ్య

తడ: తడకండ్రిగ గ్రామ పంచాయతీ కార్యాలయంలో రూ.40 వేలు లంచం తీసుకుంటూ గ్రామ పంచాయతీ కార్యదర్శి రమణయ్య ఏసీబీ అధికారులు బుధవారం పట్టుబడ్డాడు. ఏసీబీ అడిషనల్ ఎస్పీ దేవప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. వరదయ్యపాళెం మండలం, చిలమత్తూరు గ్రామానికి చెందిన కిలారి రామకృష్ణ అల్లుడికి తడకండ్రిగ పరిధిలో ఇంటి స్థలం ఉంది. అందులో ఇల్లు నిర్మించుకునేందుకు అవసరమైన అప్రూవల్, బిల్డింగ్ ప్లాన్ కోసం పంచాయతీ కార్యదర్శిని ఈనెల 10వ తేదీన సంప్రదించారు. వీటికోసం రూ.50 వేలు అవసరం అవుతాయని కార్యదర్శి చెప్పడంతో రామకృష్ణ వెళ్లిపోయారు. తిరిగి 14వ తేదీన కార్యాలయానికి వచ్చిన ఆయనకు మళ్లీ అదే సమాధానం రావడంతో బేరం మాట్లాడి రూ.40 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆమేరకు ప్లాన్ తయారుచేసేందుకు స్థానికంగా ఉన్న ఓ ఇంజినీర్ ద్వారా ప్లాన్ వేసేందుకు అవసరమైన పత్రాలు తీసుకుని బుధవారం రమ్మని కార్యదర్శి చెప్పాడు. అయితే రూ.15 వేలు ఖర్చయ్యే పనికి అంత మొత్తం నగదు ఇవ్వడం ఇష్టంలేని రామకృష్ణ అవినీతి నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన 14400 నంబరుకు ఫిర్యాదుచేశారు. స్పందించిన అధికారులు ముందుగా కార్యాలయం వద్దకు చేరుకుని రామకృష్ణ తెచ్చిన నగదును ఏసీబీ పద్ధతిలో ఇచ్చి పంపారు. దానిని కార్యదర్శి రమణయ్య తీసుకోవడంతో ఏసీబీ డీఎస్పీ జనార్ధన్‌నాయుడు, సీఐలు ఈశ్వర్, ప్రతాప్ రెడ్డి, వెంకట్ నాయుడు దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. దీనిపై విచారణ సాగుతోంది.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా హల్‌చల్



సూళ్లూరుపేటలో మోర్ సూపర్ మార్కెట్ అద్దాలు పగులగొట్టిన దుండగులు



క్యాష్ బాక్స్ వద్ద తాళాలను పగులగొడుతున్న దుండగుడు, సీసీ కెమెరా దృశ్యం

సూళ్లూరుపేట : తమిళనాడుకు చెందిన దొంగల ముఠా మంగళవారం రాత్రి సూళ్లూరుపేట, తడలో హల్‌చల్ చేసింది. సీసీ ఫుటేజీ ప్రకారం రెండు బైక్‌లపై ముసుగులు ధరించి వచ్చిన ఐదుగురు వ్యక్తులు గడ్డపారతో పలు దుకాణాలకు తాళాలు పగులగొట్టారు. తడలోని ఎస్కే మొబైల్ షాపులో కొన్ని ఫోన్లు, రూ.20వేల నగదు చోరీ చేశారు. అనంతరం సూళ్లూరుపేటకు కూడా వచ్చి షార్ బస్టాండ్ సెంటర్‌లో కేకే పాన్‌బ్రోకర్స్ తాళాలు పగులగొట్టారు, కానీ లోపలకి వెళ్లలేకపోయారు. అలాగే అష్టలక్ష్మీ సూపర్ మార్కెట్, కోళ్లమిట్ట వద్ద మోర్ సూపర్ మార్కెట్ మార్ట్ షట్టర్ తాళాలు పగులగొట్టి లోనికి వెళ్లారు. అక్కడ వారికి ఏమీ దొరకలేదు. ఈ లోపు రాత్రి గస్తీలో వున్న ఎస్ఐ పూరి రవిబాబు, సిబ్బంది వారిని గమనించగా, బైక్‌లపై ఉడాయించారు. పోలీసులు వారిని వెంబడించి ఒక్క వ్యక్తిని మాత్రం అదుపులోకి తీసుకోగా నలుగురు తప్పించుకుని వెళ్లిపోయారు.

ప్రాణం తీసిన ఈత సరదా

గూడూరురూరల్ : పట్టణ పరిధిలోని నెల్లటూరు చవటగిరిజన ప్రాంతంలో ఉన్న చెరువులో బుధవారం సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లి ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన ఖాదర్‌బీ కుమారుడు షారూక్‌ఖాన్(20) కూలి పనులు చేసుకునేవాడు. స్నేహితులతో కలసి ఈత కొట్టేందుకు చెరువులో దిగాడు. ఈత రాకపోవడంతో మునిగిపోయాడు. మిత్రుల కేకలు విన్న స్థానికులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. ఈమేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చేతికంది వచ్చిన కొడుకు విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

కాపాడమ్మా.. ముత్యాలమ్మా





గొల్లల వేడుకల్లో వీరతాళ్లు (ఇన్‌సెట్) విశేషాలంకరణలో పోలేరమ్మ

చిల్లకూరు : తూర్పు కనుపూరులో వెలసిన ముత్యాలమ్మ జాతరకు బుధవారం భక్తులు పోటెత్తారు. అమ్మవారి సర్వదర్శనంతోపాటు ప్రత్యేక క్యూలు సైతం కిక్కిరిసిపోయాయి. బంగారుచీర అలంకరణలో దర్శనమిచ్చిన శక్తిస్వరూపిణిని సేవించుకున్న తర్వాత భక్తులు వెయ్యి కళ్ల దుత్తలను పగులగొట్టి, గుడిపై కోడి పిల్లలు, ధాన్యం, ఉల్లిపాయలను వేసి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే పోలేరమ్మ ఆలయం వద్ద మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు అమ్మవారికి దున్నలను కానుకగా సమర్పించుకున్నారు. గణాచారి విశేష పూజలు చేసి పోలేరమ్మను నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా భక్తులు కాపాడమ్మా ముత్యాలమ్మా.. జైపోలేరమ్మ అంటూ పొలికేకలు వేస్తూ పారవశ్యం చెందారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను ఆలయ ఈఓ నవీన్‌కుమార్, ప్రత్యేకాధికారి కోవూరు జనార్ధనరెడ్డి పర్యవేక్షించారు.

సైబర్ నేరాలపై గ్రామీణులకు అవగాహన

- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు
- బోయకొండ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవనంపై చర్యలు
- డీఐజీ రవిప్రకాష్



చౌడేపల్లె : సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ రవిప్రకాష్

పలమనేరు/చౌడేపల్లె: నేరాల నియంత్రణకు గ్రామీణ ప్రాంతాల వారికి సైబర్, సోషల్ మీడియా పరిచయాల ద్వారా జరిగే నష్టాలపై అవగాహన క ల్పించాలని పోలీసు అధికారులను అనంతపురం రేంజ్ డీఐజీ ఎం.రవిప్రకాష్ ఆదేశించారు. బుధవారం డీఎస్పీ, చౌడేపల్లె సర్కిల్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్లు, సోషల్‌మీడియా కారణంగా మైనర్ బాలికలు పెడదోవపడుతున్నారని తెలిపారు. దీంతో ఎలోప్‌డ్ కేసులు పెరుగుతున్నాయన్నారు. పలమనేరు పోలీసు సబ్‌డివిజన్‌లో నేరాలు అధికంగా ఉన్నాయన్నారు. ఇక్కడి జరిగిన హత్యలను పరిశీలిస్తే ఎక్కువగా వివాహేతర సంబంధాలు, కక్షల కారణంగా జరిగినట్టు తెలుస్తోందన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలపై అఘాయిత్యాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. బాలికలను ప్రలోభపెట్టేవారిని నియంత్రించేలా తమశాఖ ఓ ప్రణాళిక ప్రకారం పనిచేస్తోందని తెలిపారు. తల్లితండ్రులు పిల్లల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ప్రవర్తనపై నిఘా ఉంచాలని సూచించారు. వన్యప్రాణుల వేట కోసం కొందరు ఏర్పాటు చేసే కరెంట్ తీగలతో జనం ప్రాణాలు పోతున్నాయన్నారు. దీనిపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించామన్నారు. రేషన్‌బియ్యం, ఎర్రచందనం, కర్నాటక మద్యం అక్రమరవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్‌లను గుర్తించి నివారణకు రవాణాశాఖ, ఆర్అండ్‌బీ అధికారులతో సంయుక్తంగా ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద, పరిసర ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల గుర్తించాలని సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. చౌడేపల్లె, పలమనేరు పోలీసుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్పీ రిషాంత్‌రెడ్డి, డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐ మధుసూదనరెడ్డి, చంద్రశేఖర్, ఎస్ఐలు రవికుమార్,ఎస్ఐ నాగరాజు పాల్గొన్నారు.

అవగాహనతోనే హక్కుల రక్షణ



సావనీర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

తిరుపతి రూరల్ : వినియోగదారులు చట్టాలపై అవగాహన పెంపొందించుకుంటేనే హక్కుల రక్షణ సాధ్యమని జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి ప్రసాద్ తెలిపారు. బుధవారం తిరుపతిలోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు.

'స్వచ్ఛమైన ఇంధన పరివర్తన ద్వారా వినియోగదారులకు సాధికారత కల్పించడం' అనే అంశంపై సావనీర్ ఆవిష్కరించి అనంతరం సదస్సులో మాట్లాడారు. బొగ్గు, పెట్రోలు, డీజిల్ వంటి శిలాజ ఇంధనాలను అధికంగా వినియోగించడం వల్ల పర్యావరణ కాలుష్యం పెరుగుతోందన్నారు. సహజ ఇంధనాల అన్వేషణ, పర్యావరనానికి అనుకూలమైన జీవనశైలికి కృషి చేయాలని సూచించారు. వినియోగదారుల సంఘం అధ్యక్షుడు రాజారెడ్డి మాట్లాడుతూ వస్తు నాణ్యత, సేవాలోపం వల్ల నష్టపోతే రూ.5లక్షల వరకు పరిహారం కోరవచ్చన్నారు. ఫోరమ్‌కు చేసే ఫిర్యాదులపై ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. సెట్విన్ సీఈఓ మురళీకృష్ణ మాట్లాడుతూ నాణ్యమైన వస్తువులనే కొనుగోలు చేయాలని అప్పుడే ప్రశ్నించే తత్వం వస్తుందన్నారు. జిల్లా ఆహార భద్రతాధికారి మద్దిలేటి మాట్లాడుతూ నాణ్యమైన ఆహార పదార్థాలనే భుజించాలని సూచించారు. సదస్సులో తూ.కొ శాఖ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వర్, స్వరాజ్యలక్ష్మి, అరుణ, జగదీశ్వర్, నర్మద, సురేంద్ర పాల్గొన్నారు.

ఆర్జిత సేవలను సద్వినియోగం చేసుకోండి

- కాణిపాకం ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి



కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో నూతనంగా ప్రారంభించిన ఆర్జిత సేవలను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి కోరారు. ఈనెల 4న సహస్రనామార్చన సేవ ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సేవ ఉదయం 6 గంటల నుంచి 6.30 గంటల వరకు జరుగుతుందని, రూ.1000 టికెట్ తీసుకుంటే ఇద్దరు భక్తులు పాల్గొనవచ్చని వివరించారు. ఈనెల 5న ఉదయాస్తమాన సేవ ప్రారంభించామని, రూ.లక్ష టికెట్ తీసుకుంటే పది సంవత్సరాల పాటు, సంవత్సరంలో ఒక రోజు ఇద్దరు భక్తులకు, వారితో పాటు 12 సంవత్సరాల లోపు పిల్లలు అనుమతిస్తారని, ఆలయంలో ఉద యం నుంచి రాత్రి వరకు జరిగే 13 సేవల్లో పాల్గొనవచ్చని తెలిపారు. భక్తులకు రెండు రోజుల పాటు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సేవలను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. భక్తుల కోరిక మేరకు ఇంకా పలు ఆర్జిత సేవలను ప్రారంభించనున్నట్లు తెలిపారు.